క్లుప్తంగా

అకట్టుకున్న కోలాటం



బండారులంకలో కోలాటం నిర్వహిస్తున్న విద్యార్థులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక గ్రామం మట్టపర్తివారిపాలెంలో కొలువైన సిద్ధి బుద్ధి సమితి వరసిద్ధి వినాయక స్వామివారి సన్నిధిలో బుధవారం నిర్వహించిన మురళీ కోలాటం అందరినీ ఆకట్టుకుంది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకుని కోలాటం తిలకించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కడలి రాజు, బొంతు శ్రీనుబాబు, మామిడిశెట్టి విష్ణుప్రసాద్, మట్టపర్తి అజయ్‌కుమార్, మట్టపర్తి కృష్ణ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

తాళ్లరేవు: మండలంలోని జార్జిపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇంధన సూర్యనారాయణ కుటుంబానికి ముమ్మిడివరం ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ రూ.5 వేల నగదు, నిత్యావసర వస్తువులు, బియ్యం బుధవారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుత్తుల సత్యవేణి, సూర్యనారాయణ, అత్తిలి బాబూరావు, కడలి శ్రీనివాస్, కూనపురెడ్డి కామేశ్వరరావు, రాయుడు గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

అమలాపురం రూరల్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం అమలాపురం మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో రైతులకు ఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్ తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

13న విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు: ఇంజరంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్, సుంకరపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగించే నిమిత్తం ఈ నెల 13వ తేదీన ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు కాకినాడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయభాస్కర్ బుధవారం తెలిపారు. ఈ కారణంగా పల్లిపాలెం, సుంకరపాలెం, బైపాస్, లచ్చిపాలెం, ఉప్పంగల, తంగేటిపంపు గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

వరద బాధితులకు వితరణ

అమలాపురం టౌన్: విజయవాడ వరద బాధితులకు అమలాపురం శ్రీపరంజ్యోతి మానవ సేవా సమితి సభ్యులు ప్రత్యేక వాహనంలో నిత్యావసర సరకులు, దుస్తులు తీసుకుని వెళ్లి అందజేశారు. విజయవాడ సమీపంలోని అంబాపురం గ్రామంలో వరద బాధితులకు సేవా సమితి వితరణ కార్యక్రమం చేపట్టింది. వితరణ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ప్రకాష్, అప్పారావు, దుర్గారావు, పార్వతి, లక్ష్మి, రామలక్ష్మి, నారాయణ, రత్నం, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు చిట్టిబాబుకు సత్కారం



చిట్టిబాబును సత్కరిస్తున్న అమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

అమలాపురం టౌన్: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షునిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును అమలాపురం నియోజకవర్గ పార్టీ నాయకులు బుధవారం సత్కరించారు. మామిడికుదురు మండలం నగరం గ్రామంలోని చిట్టిబాబు ఇంటికి అమలాపురం పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాస్, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, పార్టీ జిల్లా కార్యదర్శి నుగ్గు ప్రసాద్ తదితరులు వెళ్లి అభినందించారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

అమలాపురం టౌన్: యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ గంటి హరీష్ మాధుర్ అన్నారు. 1893 సెప్టెంబర్ 11న అమెరికా షికాగోలో జరిగిన సభలో భారతదేశం తరపున స్వామి వివేకానంద పాల్గొని దేశ ఆధ్యాత్మికత గొప్పదనాన్ని వివరిస్తూ ప్రసంగించిన రోజును పురస్కరించుకుని స్థానిక ఎర్ర వంతెన వద్ద గల స్వామి వివేకానంద విగ్రహానికి ఎంపీ హరీష్ మాధుర్ పూలమాలలు వేసి ఆయన వ్యక్తిత్వం గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు పెనుమాల చిట్టిబాబు, కార్యదర్శి జి.నాగరాజు, సలాది వెంకట సాయిరామ్, డాక్టర్ గోదశి గంగరాజు, బూరగాయల అరవింద్ ఘోష్, డాక్టర్ కొప్పినీడి రమణకుమార్, డాక్టర్ బి.రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



టైడల్ లాకు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్



యానాంలో ఓల్డ్‌రాజీవ్‌నగర్‌ను ముంచెత్తిన వరద



యానాం బాలయోగి వారధి వద్ద వరద ఉధృతి



కొమరగిరిలో ఆక్వా చెరువును ముంచెత్తిన వరద

మళ్లీ పోటెత్తిన వరద

- పల్లిపాలెంలో ముంపునకు గురైన మత్స్యకారుల ఇళ్లు
- లంక పొలాలు, కొబ్బరి తోటల్లోకి చేరిన వరద



ఎదుర్లంక వారధి వద్ద వరద ఉధృతి

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద తీవ్రతతో మండలంలోని బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని పల్లిపాలెంలోకి వరద పోటెత్తింది. పల్లిపాలెంలోని మత్స్యకారులకు చెందిన 45 ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి ఉన్నందున మండలంలోని గోడితిప్ప, గోపాయిలంక ప్రాంతాల్లో భారీగా వరద వచ్చే అవకాశముంది. బుధవారం సాయంత్రానికి వరద తీవ్రత పెరిగింది. వరదలో చిక్కుకున్న కుటుంబాలకు పడవల ద్వారా తాగునీరు అందించారు. స్థానిక ఎంపీపీ పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. వరద ప్రభావిత ప్రాంతంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, తహసీల్దార్ నరసింహరావు, ఎంపీడీఓ కృష్ణమోహన్ పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. ఈ ఏడాదిలో వరద రావడం మూడోసారని, వరద వచ్చిన ప్రతిసారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వరద పెరుగుతుండడంతో గోపాయిలంక అక్విడెక్టు వద్ద అవుట్ ఫ్లో సూయిజ్ నుంచి వరద నీరు కుమ్మరి కాలువలోకి ఎదురెక్కుతుంది. దీంతో కుమ్మరికాలువ, దేశికోడు డ్రైన్ గోదావరిని తలపిస్తున్నాయి.

లంక ప్రాంతాల మునక

ఐ.పోలవరం: మండల పరిధిలో ఏటిగట్టు దిగువన లంక ప్రాంతాల్లో వరద నీరు చేరింది. ఇటు గౌతమి, అటు వద్ద గౌతమి నదీ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకూ వరద పెరుగుతూనే ఉంది. అన్నంపల్లి పాత అక్విడెక్టును తాకుతూ గోదావరి పోటెత్తుతోంది. రాఘవేంద్ర వారధి, ఎదుర్లంక వారధుల వద్ద వరద గోదావరి సుడులు తిరుగుతూ ప్రవహిస్తోంది. మురమళ్ల రాఘవేంద్ర వారధిని ఆనుకుని ఉన్న మత్స్యకార నివాసాల మధ్యకు వరద నీరు వచ్చి చేరుతోంది. మురమళ్ల, కేశనకుర్రు, కోమరగిరి ఏటిగట్టు దిగువన లంక పొలాలు, కొబ్బరి తోటలు, ఆక్వా చెరువులోకి వరద నీరు ప్రవేశించింది. గత జులై నెలలో ఆక్వా చెరువులు ముంపు బారిన పడిన విషయం తెలిసిందే. దీంతో ఏటిగట్టు దిగువన ఎదుర్లంక, కేశనకుర్రు, మురమళ్ల వంటి ప్రాంతాల్లో ఆక్వా సాగు చేసే చోట్ల రైతులు ఇంకా సాగు మొదలు పెట్టలేదు. దీని వల్ల ఆక్వాకు కొత్తగా నష్టమొచ్చే అవకాశాలు తక్కువని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదావరి వరద తీవ్రత రాత్రికి మరింత పెరిగే అవకాశముంది. గోదావరి వరదల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ఓల్డ్ రాజీవ్‌నగర్‌లో వరదనీరు

యానాం: పట్టణ పరిధిలోని ఓల్డ్ రాజీవ్‌నగర్‌లో బుధవారం వరద నీరు ప్రవహించడంతో పలు నివాసిత ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో మోటార్ల ద్వారా వరద నీటిని తోడుతున్నారు. మరోపక్క గౌతమి గోదావరి బాలయోగి వారధి వద్ద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మత్స్యకార గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

గౌతమి గోదావరిలో వరద ఉధృతి కొనసాగుతుండటంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన పీడబ్ల్యూడీ ఇంజినీర్ల బృందంతో కలిసి వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రాజీవ్ రివర్‌బీచ్ వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. టైడల్‌లాక్ వద్ద గేట్లు పూర్తిగా కిందకు దించేసి ఓల్డ్‌రాజీవ్‌నగర్ ఏరియాలో ఉన్న వరద నీటిని పంపుల ద్వారా బయటకు తోడుతున్నట్లు అధికారులు తెలిపారు. బాలయోగినగర్, పరంపేట గ్రామాల్లో సైతం మోటార్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అశోక్ ఆదేశించారు. ఏటిగట్టు పటిష్టత, ఇసుక బస్తాలను సిద్ధం చేయడం తదితర అంశాల గురించి అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఈఈ చంద్రశేఖరన్, ఏఈ కాళ్ల నాగరాజు పాల్గొన్నారు.



బోడసకుర్రు పల్లిపాలెం మత్స్యకార కాలనీలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

దిగబడిపోతున్న రక్షణ గట్టు

కాట్రేనికోన: ఇటీవల కురుస్తున్న వర్షాలకు తోడు ఏటిగట్టు పనుల్లో నాణ్యత లేక మురమళ్ల నుంచి బలుసుతిప్ప వెళ్లే రక్షణగట్టు కుండలేశ్వరం వద్ద పంట కాలువ వైపు దిగబడిపోతోంది. కుండలేశ్వరం పుష్కర ఘాట్ సమీపంలో ఏటిగట్లు దిగబడడంతో ఇరిగేషన్ అధికారులు మొక్కుబడిగా సరుగుడు కర్రలు, వెదురు తడకలు కట్టి మట్టి వేసి వదిలేశారు. గత జులై నెలలో గోదావరికి వరదలు వచ్చిన సమయంలో ఈ ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్ గండి పడే ప్రమాదం పొంచి ఉందని గుర్తించి రక్షణ పనులు చేపట్టాలని హెడ్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. అయితే హెడ్ వర్క్స్ అధికారులు మొక్కుబడిగా గ్రావెల్ వేసి పనులు కానిచ్చేశారు. అయితే హెడ్ వర్క్స్ అధికారుల తడక వైద్యం పని చేయకపోవడంతో ప్రస్తుతం ఏటిగట్టు సుమారు 100 మీటర్లకు పైబడి రెండు మీటర్ల వెడల్పున పంట కాలువ వైపు దిగబడింది. గోదావరి వరద ఉధృతి పెరగడంతో అధికారులు ముంపు ప్రభావిత ప్రాంతాలు నడవపల్లి, పల్లంకుర్రు, బూలవారి మొండి తదితర ప్రాంతాల్లో పర్యటిస్తున్నారే తప్ప దిగబడుతున్న ఏటిగట్టుకు రక్షణ చర్యలు చేపట్టాలనే ఆలోచన కనబడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో శానపల్లి లంకలో ఏటిగట్టు గండి పడటంతో వరద నీరు కోనసీమను ముంచెత్తిన ఘటనను గుర్తు చేసుకుంటున్నారు. కుండలేశ్వరం ఏటిగట్టుకు గండి పడితే కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అమలాపురం, అల్లవరం మండలాలకు వరద ముంపు తప్పదని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కళ్లు తెరిచి ముందస్తుగా గట్టు రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ఉగ్రరూపం దాల్చే పరిస్థితి ఉన్నందున నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు బుధవారం హెచ్చరించారు. మండల ప్రత్యేక అధికారి ఐ.విమల ఆధ్వర్యంలో తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, ఎంపీడీఓ వెంకటాచలం నడవపల్లి, పల్లంకుర్రురేవు ప్రాంతం, బూలవారి మొండి తదితర వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించారు.



కుండలేశ్వరం పుష్కర ఘాట్ సమీపంలో పంట కాలువ వైపు దిగబడుతున్న ఏటిగట్టు

జీఓ నంబరు 115ను రద్దు చేయాలి

ముమ్మిడివరం: జీఓ నంబరు 115ను రద్దు చేసి తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు బుధ వారం ఆందోళన చేపట్టారు. ముమ్మిడివరం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. 20 ఏళ్లుగా తక్కువ జీతానికి పనిచేస్తున్న తమకు జీఓ 115 వల్ల అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కోవిడ్ సమయంలో తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించామని వాపోయారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుకు అందజేశారు. కార్యక్రమంలో యు.అచ్యుతవల్లి, పి.నాగలక్ష్మి, ఎం.విజయ, జి.గౌతమి, పి.ధనలక్ష్మి, జి.దుర్గమ్మ, ఎం.రమావతి, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావుకు వినతి పత్రం అందజేస్తున్న స్టాఫ్ నర్సులు

సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం

ఉప్పలగుప్తం: మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ రీసోర్స్‌పర్సన్ బి.దాసు ఆధ్వర్యంలో సిబ్బందికి సామాజిక తనిఖీపై బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం నుంచి ప్రతి గ్రామంలో సిబ్బంది పర్యటించి ఉపాధి మస్టర్లను, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన పనులను క్షుణ్ణంగా పరిశీలించి గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.వెంకటేశ్వరప్రసాద్, పీఆర్ ఏఈ వి.రాధాకృష్ణ, ఏపీవో వి.రాజామణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ రీసోర్స్‌పర్సన్ దాసు

సామాజిక తనిఖీలకు రికార్డులను సిద్ధం చేయాలి

అల్లవరం: ఉపాధి హామీ పథకం ద్వారా అన్ని పనులకు సంబంధించి రికార్డులను సిద్ధం చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదేశించారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఆగస్టు 23న అన్ని గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో తీర్మానం చేసిన పనుల ప్రతిపాదనలకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. మినీ గోకులం దరఖాస్తులను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన

ముమ్మిడివరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ముమ్మిడివరం మాలమహానాడు జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పోలీస్ స్టేషన్ సెంటర్ నుంచి జేఏసీ నాయకులు నీలి జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. దఅనంతరం తహసీల్దార్‌కు ఎస్సీ వర్గీకరణపై తీర్పును వ్యతిరేకిస్తూ వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో దేవరపల్లి ఏడుకొండలు, కాశి జగపతిరావు, మెండి కృష్ణబాబు, కాశి బాలమునికుమారి, మోకా రామారావు, కాట్రు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ పలు దళిత సంఘాలు అమలాపురం గడియారం స్తంభం సెంటరులో బుధవారం ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహించాయి. జిల్లా దళిత ఐక్య వేదిక, వర్గీకరణ వ్యతరేక పోరాట సమితి, బహుజన సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) సంయుక్తంగా ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. దళితుల మధ్య చిచ్చు పెట్టడానికే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్ డీబీ లోక్ ఆరోపించారు. రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న సుప్రీంకోర్టు తీర్పును వెనక్కి తీసుకోవాలని దళిత ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ జంగా బాబూరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ ఇన్‌చార్జి పొలమూరి మోహనబాబు, ఇసుకపట్ల రఘుబాబు, గొల్లపల్లి డేవిడ్, సరెళ్ల రామకృష్ణ, రేవు తిరుపతిరావు, ములపర్తి సత్యనారాయణ, దేవరపల్లి శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జేఏసీ నాయకులు

మనోహర్‌కు జేఆర్‌ఎఫ్‌లో 5వ ర్యాంకు

యానాం: నియోజకవర్గ శివారు దరియాలతిప్ప గ్రామానికి చెందిన సబ్బతి విజయ మనోహర్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌లో జాతీయ స్థాయిలో 5వ ర్యాంకు సాధించి ఐసీఏఆర్ ఏఐసీఈ–జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్)కు ఆయన ఎంపికయ్యారు. అదేవిధంగా పీహెచ్‌డీ కోర్సుకు సైతం ఆయన అర్హత సాధించారు. వ్యవసాయ పరిశోధనలో ఆయనకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ మొదటి రెండేళ్లు నెలకు రూ.37 వేల చొప్పున ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా మనోహర్‌ను గ్రామస్తులు అభినందించారు.



మనోహర్

అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు

యానాం: అగ్ని ప్రమాదాలను నివారించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, అప్రమత్తతపై బుధవారం స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో యానాం అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణ, అగ్నిమాపక సాధనాలు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. అగ్నిప్రమాదంలో చిక్కుకున్న బాధితులను ఏ విధంగా రక్షిస్తారో ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్ కోన కృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణసుధాకర్, ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి గాలి జానకిరామయ్య, చీకట్ల రాజశేఖర్, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

బాధితుడికి సాయం అందజేత



రవీంద్రకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాగపట్నం గ్రామ యువత

కాట్రేనికోన: పి.గన్నవరం నియోజకవర్గంలోని లంకల గన్నవరం డొక్కా సీతమ్మ కాలనీకి చెందిన కొల్లు రవీంద్ర రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న కాట్రేనికోన మండలం నాగపట్టణం గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ యువకులు తలోకొంత వేసుకుని బాధితుడు రవీంద్రకు రూ.12,600 సాయంగా అందజేసి ధైర్యం చెప్పారు. అభాగ్యులకు అండగా నిలుస్తున్న యువకుల బృందాన్ని స్థానికులు అభినందించారు.

శ్రీశ్రీ కళా వేదిక సేవలు అభినందనీయం

అమలాపురం టౌన్: శ్రీశ్రీ కళా వేదిక ద్వారా అందిస్తున్న సాహిత్య సేవలు అభినందనీయమని కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో కలెక్టర్ మహేష్‌కుమార్‌ను పలువురు కవులు, సాహితీవేత్తలు స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం కలిసి తెలుగు భాషా దినోత్సవ సంబరాల జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఇటీవల అమలాపురంలో జరిగిన జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో అయిదు రాష్ట్రాల కవులు పాల్గొనడం ప్రశంసనీయమన్నారు. అనంతరం డాక్టర్ ప్రతాప్ రచించిన ‘అతడు–ఆమె’ పుస్తకాన్ని కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, వేదిక జాతీయ కమిటీ కార్యదర్శి మాకే బాలార్జున, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ మహేష్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ ప్రతాప్ తదితరులు

పాఠశాలలకు ల్యాబ్ పరికరాల అందజేత



ప్రధానోపాధ్యాయులకు ల్యాబ్ పరికరాలను అందజేస్తున్న రిలయన్స్ ప్రతినిధులు

తాళ్లరేవు: గాడిమొగలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం సైన్స్ పరికరాలను అందజేశారు. కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా గాడిమొగ, లక్ష్మీపతిపురం, భైరవపాలెం, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ల్యాబ్ పరికరాలను రిలయన్స్ హెచ్‌ఆర్ మేనేజర్ కె.శివప్రసాద్, సీఎస్‌ఆర్ హెడ్ పి.సుబ్రహ్మణ్యం అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

అమలాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో వినాయక చవితి సందర్భంగా పాఠశాల ఎకో క్లబ్ విద్యార్థులకు నిర్వహించిన మట్టి వినాయక ప్రతిమల తయారీ పోటీల్లో విజేతలకు ఎంపీ గంటి హరీష్ మాధుర్ బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్ రాయుడు దుర్గాదేవి, మెట్ల రమణబాబు, నల్లా పవన్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

అమలాపురం టౌన్: అమలాపురం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్య వైశ్య సంఘానికి ఎన్నికైన నూతన కార్యవర్గ ప్రతినిధులు స్థానిక కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆర్య వైశ్య సంఘానికి నూతన అధ్యక్షునిగా నంబూరి సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా నంబూరి నరేష్, కోశాధికారిగా కొమ్మూరి వెంకటాచల ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం చేత జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు కంచర్ల బాబి, మాజీ అధ్యక్షుడు పల్లపోతు బంగారం, మాజీ జోనల్ చైర్మన్ కుసుమంచి పాపారావు, సంఘం గౌరవాధ్యక్షుడు యెండూరి వెంకటరామయ్యలు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవ సభకు రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయలు, రాష్ట్ర కార్యదర్శి ప్రగలపాటి కనకరాజు, రాష్ట్ర అదనపు కార్యదర్శి కొల్లూరి చినబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్, గౌరవాధ్యక్షుడు అల్లాడ స్వామినాయుడు, బులియన్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, యెండూరి రాఘవ, యెండూరి సీత తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సంఘ నాయకులు

పౌష్టికాహారంపై అవగాహన

అమలాపురం రూరల్: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా తాండవపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య భారతికి ఘన నివాళులు

యానాం: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తమిళ రచయిత చిన్నస్వామి సుబ్రహ్మణ్యభారతి వర్ధంతిని బుధవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి స్థానిక ఫెర్రీరోడ్డులోని సుబ్రహ్మణ్య భారతి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కె.రామకృష్ణ, పీఆర్ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళకు డెంగీ లక్షణాలు

ఐ.పోలవరం: మండలంలోని తిల్లకుప్ప గ్రామంలో ఒక మహిళకు డెంగీ లక్షణాలు కనిపించడంతో చికిత్స అందిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సుధా చినవీరమణి రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. బుధవారం స్థానిక కేశనకుర్రు పీహెచ్‌సీలో వైద్యులు ఎంవీ రాజేష్‌బాబు ఆమెకు డెంగీ ప్రాథమిక లక్షణాలు ఉన్నట్లు గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. నిర్ధారణ కోసం, మెరుగైన చికిత్స కోసం ఆమెను అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు డెంగీ జ్వరం నిర్ధారణ టెస్టులు నిర్వహించి డెంగ్యూ ఉందని నిర్ధారించారు. అక్కడి ఆస్పత్రిలో పేషెంట్లు ఎక్కువగా ఉన్న కారణంగా మండలంలోని టి.కొత్తపల్లి పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందిస్తున్నారు. గ్రామంలో శానిటేషన్, పారిశుధ్య పనులు చేపట్టాలని, జ్వరాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు రాజేష్‌బాబు సూచించారు.